



మైన పఠనంతో విద్యారణ్యమ్ ప్రాంగణం ఆహ్లాదకరంగా ఉంటుంది. శ్రవణ, మనన, నిధి, ధ్యాన పద్ధతుల్లో విద్యార్థులు వేదాలను అధ్యయనం చేస్తుంటారు. ప్రతి రోజూ 8 గంటలు ఇది కొన సాగుతుంది. పదేండ్ల వ్యవధిలో ఐదు అంచెల్లో (మూలము, పదము, క్రమము, జట, ఘన) విద్యార్థులు అధ్యయనం పూర్తి చేసేలా పాఠ్య ప్రణాళిక ఉంటుంది. సంస్కృత మాధ్యమంలో సాగే వేదాధ్యయనం కోసం సంస్కృత భాషాధ్యయనం కూడా చేయాలి. సంస్కృత శబ్దమంజరి, ధాతు మంజరి, వ్యాకరణ శాస్త్రం బోధిస్తారు. ప్రతి శనివారం సాయంత్రం ప్రత్యేకంగా వేద గణితం నేర్పిస్తారు.

**త్రికాల సంధ్యావందనం, శుశ్రూష, నియమబద్ధమైన అధ్యయనం, చరిత్ర, సంస్కృతి, వైదిక ధర్మ అవగాహన కల్పించడం విద్యారణ్యమ్‌లోని విద్యాబోధన ప్రత్యేకత. వేదం, శాస్త్రం అధ్యయనంతోపాటు విద్యార్థులందరూ తప్పనిసరిగా సంగీత సాధన, వ్యాయామ విద్యలు సాధన చేయాలి. వ్యక్తిగత శుభ్రత నుంచి పాఠశాల నిర్వహణ వరకు అన్నీ పిల్లలే బాధ్యత తీసుకుంటారు.**

వేద జ్ఞానంతోపాటు బౌద్ధిక వికాసం కోసం విద్యార్థులు ప్రతిరోజూ అర్ధ గంట సమయం కేటాయిస్తారు. ఈ సమయంలో 'బౌద్ధిక కాలాంశం' పేరుతో దేవ చరిత్ర, సంస్కృతి, మహనీయుల జీవితాల గురించి చర్చిస్తారు. ఆలోచనలకు పదునుపెట్టేందుకు పిల్లలకు ఇష్టమైన కథలు చెబుతారు. విద్యార్థులకు సుభాషితాలు, పాటలు నేర్పించి, వాటి భావం వివరిస్తారు. ఇలా శ్లోకాలు, పాటల ద్వారా ఆధ్యాత్మిక సారాన్ని అందిస్తారు. ప్రతి నెలా ఒక పాటను సాధన చేయడం ప్రతి విద్యార్థి కర్తవ్యం. విద్యార్థులు వేద, శాస్త్ర అధ్యయనాలతోపాటు కర్ణాటక గాత్ర, వాద్య సంగీతాలను కూడా తప్పకుండా సాధన చేయాలి. వీణ, వేణువు, మృదంగం వాద్యాలలో ఇష్టమైనదానిని ఎంచుకుని సాదన చేయవచ్చు.

### ఆటపాటల చదువు

వీటితోపాటే సాధారణ పాఠశాలల్లో బోధించే గణితం, సామాన్యశాస్త్రం, సాంఘిక శాస్త్ర పాఠాలు బోధిస్తారు. సాధారణ పాఠ్యాంశాలను ఆంగ్ల మాధ్యమంలో బోధిస్తారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షలు రాయిస్తున్నారు. వేద విద్యార్థులు ప్రతి రోజూ శారీరక దృఢత్వం కోసం వ్యాయామ విద్యలు, ఆత్మ రక్షణకు దోహదపడే యుద్ధ విద్యలు సాధన చేస్తారు. వీటితోపాటు మానసిక ఉల్లాసం కలిగించే ఆటలూ ఆడతారు. ప్రతివారం కలరి







యపట్టులో రెండు క్లాసులు ఉంటాయి. ప్రతిరోజూ అర గంట కర్రసాము చేస్తారు. ఓ అరగంట కబడ్డీ, కోకో వంటి దేశీయ ఆటలు ఆడుతూ విద్యారణ్య వేద విద్యార్థులు ఆనందంగా గడుపుతున్నారు.



### దాతలే జీవనాడి



ఒకప్పుడు పౌరోహిత్యం, అర్చకత్వం, సామాజికసేవా కార్యక్రమాలు చేస్తూ ఉండేవాడిని. వాటికంటే ఉన్నతమైన సామాజిక ప్రయోజనం కోసం 2015లో విద్యారణ్య వైదిక ట్రస్ట్ నెలకొల్పాను. ఏడు ఎకరాల సొంత భూమిలో 'విద్యారణ్యమ్' వేద పాఠశాలను ప్రారంభించాను. 'ధర్మం తెలిసిన (వేదం చదివిన) వాళ్లు భిన్న రంగాల్లో విధాన నిర్ణేతలు (పాలసీ మేకర్స్)గా ఎదగాలన్నది సంస్థ అభిలాష'! భవిష్యత్‌లో ప్రతి కులానికీ ఒక గురుకులం నెలకొల్పాలన్నది మా సంస్థ లక్ష్యం. విద్యారణ్యమ్ నిర్వహణ కోసం 'జీవనాడి' అనే ప్రకల్పం నిర్వహిస్తున్నాం. దీని ద్వారా దాతల నుంచి విరాళాలు స్వీకరిస్తాం. దాతల గోత్ర నామాలతో చండీ యాగం, రుద్ర యాగం, సుదర్శన యాగం, గణపతి హోమం నిర్వహిస్తున్నాం. ప్రతినెలా నిర్వహించే ప్రకల్పం ద్వారా సమకూరిన ద్రవ్యంతో విద్యారణ్యమ్ నిర్వహిస్తున్నాం.

• **మాడుగుల శశిభూషణ సోమయాజి**
విద్యారణ్య వైదిక ట్రస్ట్ వ్యవస్థాపకుడు

### ఏడాదంతా వేదమే

ఇంటికి దూరంగా పెరిగే వేద విద్యార్థులను పక్షానికి ఒకసారి తల్లిదండ్రులు కలుసుకునే అవకాశం ఉంది. ప్రతి పాడ్యమి రోజు సాయంత్రం రెండు గంటలపాటు తల్లిదండ్రులు పిల్లలతో గడపవచ్చు. వేసవిలో ఒక పక్షం (15) రోజులు సెలవులు ఉంటాయి. దీపావళికి నాలుగు రోజులు సెలవులు ఉంటాయి. ఇక మిగిలిన ఏడాదంతా వేదాధ్యయనం, శాస్త్ర అధ్యయనంలో మునిగిపోవాల్సిందే. విద్యారణ్యమ్‌లో ప్రస్తుతం వంద మంది విద్యార్థులు వేద అధ్యయనం చేస్తున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ అధ్యయనం చేస్తున్నారు. ఏడు సంవత్సరాలు నిండి, ఉపనయనం చేసుకున్న యజుశాఖ, ఋక్ శాఖకు చెందిన బ్రాహ్మణ బాలురు మాత్రమే ఈ పాఠశాలలో అడ్మిషన్ ఇస్తారు. వేద పాఠశాలలో పదేండ్ల పాటు ఉచితంగా విద్యాబోధనతోపాటు వసతి కల్పిస్తున్నారు. ■

... ✍ నాగవర్ధన్ రాయల